ప్రజాశక్తి

శనివారం 26 అక్టోబరు 2024

5

శ్రీకాకుళం



ఉచిత వినికిడి పరికరాలకు నమోదు

శ్రీకాకుళం అర్బన్ : విజయవాడకు చెందిన దీన్ దయాళ్ శ్రావణ ఫౌండేషన్, నేషనల్ హెల్త్ మిషన్ సంయుక్తంగా ఉచిత వినికిడి పరికరాలను ఇచ్చేందుకు వీలుగా పేర్ల నమోదు ప్రక్రియను ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో చేపడుతున్నట్లు జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి బి.మీనాక్షి ఒక ప్రకటనలో తెలిపారు. 21 ఏళ్ల లోపు వినికిడి లోపంతో బాధపడుతున్న వారికి నవంబరు 8న ఉచితంగా వినికిడి యంత్రాలను అందజేయనున్నట్లు పేర్కొన్నారు. వినికిడి సమస్యతో బాధపడుతున్న వారు ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో ఒపి నంబరు 27లో నమోదు చేసుకోవాలని సూచించారు. ఉచిత వినికిడి పరికరాల పంపిణీ కోసం మెడికల్ క్యాంపు నిర్వహించే ప్రదేశానికి ధ్రువపత్రాలు, ఆధార్, రేషన్ కార్డు, రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలు, ప్రభుత్వం జారీ చేసిన ప్యూర్ టోన్ ఆడియోమెట్రీ రిపోర్టు, సదరం సర్టిఫికెట్, డాక్టర్ ప్రిస్కిప్షన్‌తో హాజరు కావాలని సూచించారు.

తీరిక లేదా..?

ఖరీఫ్ ప్రారంభం నుంచి రైతులను సాగునీటి కష్టాలు వెంటాడుతున్నాయి. జులైలో పంట కాలువల్లో పేరుకుపోయిన గుర్రపుడెక్క, పూడిక తొలగింపు పనులు కొంతమేర చేపట్టినా ఫలితం కనిపించడం లేదు. పొట్ట, గింజ కట్టే దశకు చేరిన వరి పంటకు సాగునీరందక అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. సాగునీటి సమస్యలపై చర్చించి వాటికి పరిష్కారం చూపాల్సిన ప్రజాప్రతినిధులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. సాగునీటి సలహా మండలి సమావేశం నిర్వహించడానికి వారికి తీరిక లేకుండా పోయింది. పల్లె పండగ, శంకుస్థాపనలు, పున: ప్రారంభాలతో బిజీగా గడుపుతున్న నేతలకు సాగునీటి సమస్యలపై చర్చకు సమయం వెచ్చించలేకపోతున్నారు. దీంతో అన్నదాతలకు కడగండ్లు తప్పడం లేదు.



వంశధార కాలువ నుంచి నీరు రాక ఎండిన బొడ్డపాడులోని చెరువు

- ఏడాది కాలంగా నిర్వహించని ఐఎబి సమావేశం
- అపరిష్కృతంగానే సాగునీటి సమస్యలు
- శివారుకు సాగునీరందక ఎండిపోతున్న వరి
- ఆందోళనలో అన్నదాతలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

హిరమండలం గొట్టాబ్యారేజీ ద్వారా వంశధార కుడి, ఎడమ కాలువల కింద 2.50 లక్షల ఎకరాల ఆయకట్టు సాగవుతోంది. ఇందులో ఎడమ కాలువ ద్వారా 1.70 లక్షల ఎకరాలు, కుడి కాలువ ద్వారా 80 వేల ఎకరాలకు నీటిని అందించాల్సి ఉంది. ఎడమ కాలువ 104.5 కిలోమీటర్ల మేర విస్తరించి ఉంది. కాలువ పరిధిలో జలుమూరు, సారవకోట, నరసన్నపేట, కోటబొమ్మాళి, సంతబొమ్మాళి, టెక్కలి, నందిగాం, పలాస, వజ్రపుకొత్తూరు మండలాల పరిధిలో గల 398 గ్రామాల్లో 1,48,230 ఎకరాలకు సాగునీరందాల్సి ఉంది. కుడి కాలువ 63 కి.మీ మేర విస్తరించి ఉంది.



వజ్రపుకొత్తూరు మండలం బొడ్డపాడులో సాగు నీరు లేక పాడి బారిన పొలం

కాలువ పరిధిలో హిరమండలం, ఎల్ఎన్‌పేట, సురుబుజ్జిలి, బూర్జ, ఆమదాలవలస, శ్రీకాకుళం, గార మండలాల్లోని 165 గ్రామాల్లోని 62,280 ఎకరాలకు సాగునీరు చేరాల్సి ఉంది. రెండు కాలువల్లో అడగడుగునా పెద్దఎత్తున గుర్రపుడెక్క, పూడిక పేరుకుపోయింది. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి తర్వాత జూలైలో టెక్కలి, పలాస నియోజకవర్గాల్లోని కొన్ని ప్రాంతాల్లో హడావుడిగా జంగిల్ క్లియరెన్స్, పూడిక తొలగింపు పనులు చేపట్టారు. అవేవీ సత్ఫలితాలను ఇవ్వకపోవడంతో ప్రస్తుతం ఆయా నియోజకవర్గాలోని పలు ప్రాంతాల్లో వరి పంట ఎండిపోతోంది.

ఆ రెండు నియోజకవర్గాల్లో గడ్డు పరిస్థితి

వంశధార ఎడమ కాలువ పలాస సబ్ డివిజన్ పరిధిలో పలాస, వజ్రపుకొత్తూరు, నందిగాం మండలాలు ఉన్నాయి. ఆయా మండలాలకు చెందిన రైతులు సుమారు 22 వేల ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు. శివారు ప్రాంతాలైన వజ్రపుకొత్తూరు మండలం బెండి, నారాయణపురం, పెద్దబొడ్డపాడు, సీతాపురం, తాడివాడ, పలాస మండలంలోని చినబడాం, పెసరపాడు తదితర ప్రాంతాల్లో వరి ఎండిపోయే ప్రమాదం కనిపిస్తోంది. నందిగాం మండలం కణితివూరు, మర్లపాడు, హరిదాసుపురం, నారాయణపురం తదితర ప్రాంతాలకు సాగునీరు అరకొరగానే వస్తోంది. టెక్కలి నియోజకవర్గం సంతబొమ్మాళి మండలంలోని పలు ప్రాంతాల్లో తీవ్ర సాగునీటి కొరత నెలకొంది. పలాస నియోజకవర్గంలోని ఒక పిల్ల కాలువలో జంగిల్ క్లియరెన్స్ అయిన తర్వాత నీళ్లు వస్తున్నాయంటూ ఈ ఏడాది జూలైలో పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష సెల్ఫీ తీసుకున్నారు. ప్రస్తుతం ప్రాంతంలో వరి ఎండిపోతున్న పరిస్థితి నెలకొంది.

సాగునీటి సమస్యలపై సమీక్షలు ఏవీ?

జిల్లాలో ఒకవైపు వర్షాల్లేక, పంట కాలువల ద్వారా సాగునీరందక రైతులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. జిల్లాలో ఖరీఫ్ పరిస్థితులు, వ్యవసాయం, సాగునీటి సమస్యలపై చర్చించి పరిష్కారం చూపాల్సిన ప్రజాప్రతినిధులెవరూ పట్టించుకున్న దాఖలాలు కనిపించడం లేదు. అటు అధికార యంత్రాంగమూ వాటిపై సమీక్షించిన పాపాన పోలేదు. వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు నుంచి ఎమ్మెల్యేల వరకు పల్లె పండగ, శంకుస్థాపనలు, పరామర్శలు, పర్యటనలతో క్షణం తీరిక లేకుండా ఉన్నారు. క్యాంపు కార్యాలయాల్లో కార్యకర్తల పనులు, వారి సమస్యల కోసం గంటల కొద్దీ సమయం వెచ్చిస్తున్న ప్రజాప్రతినిధులు రైతుల కోసం కనీసం గంట పాటు సమావేశం నిర్వహించడానికి తీరిక చేసుకోలేకపోతున్నారు.

బిఎస్ఎన్ఎల్ ఉద్యోగుల ఆందోళన

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

బిఎస్ఎన్ఎల్ ఉద్యోగుల సమస్యల పరిష్కారంతో పాటు సంస్థ మనుగడను కాపాడుకునేందుకు ఆలిండియా బిఎస్ఎన్ఎల్ ఎంప్లాయీస్ యూనియన్, పెన్షనర్స్ యూనియన్, కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ సంయుక్తంగా ఆందోళన చేపట్టింది. దేశవ్యాప్త ఆందోళనలో భాగంగా నగరంలోని సంచార భవన్ వద్ద శుక్రవారం నిరసన చేపట్టారు. ఎంప్లాయీస్ కో-ఆర్డినేషన్ కమిటీ ఆధ్వర్యాన చేపట్టిన నిరసన కార్యక్రమంలో కమిటీ నాయకులు పోలాకి వెంకటరావు, మాతల గోవర్ధనరావు, వెంకటరావు పాణిగ్రహి కె.గోపాలరావు మాట్లాడారు. బిఎస్ఎన్ఎల్ ఉద్యోగులకు 2017 జనవరిలో చేయాల్సిన పే రివిజన్, 15శాతం ఫిట్‌మెంట్ అమలు చేయకుండా కేంద్ర ప్రభుత్వం తాత్సారం చేస్తోందని విమర్శించారు. ఫిట్‌మెంట్‌తో పాటు పే రివిజన్, పెన్షన్ రివిజన్ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఐదేళ్లకోసారి పే రివిజన్ చేపట్టాలన్నారు. సంస్థ పరిధిలో 4జి, 5జి సేవల విస్తరణ చేపట్టాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు వర్కర్స్‌తో పాటు క్యాజువల్ ఉద్యోగుల ప్రధాన సమస్యలను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో ఉద్యోగ సంఘ నాయకులు ఎస్.అభిమన్యు, లక్ష్మి, అరుణ, శంకర్, హెచ్.ఢిల్లీశ్వరరావు, కె.ప్రసాద్, డి.శ్రీనివాసరావు, శారద, భానుచందర్ తదితరులు పాల్గొన్నారు.




సంచార్ భవన్ వద్ద ఆందోళన చేస్తున్న బిఎస్ఎన్ఎల్ ఉద్యోగులు

ప్రజలకు మరింత మెరుగైన సేవలు

ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి

ప్రజాశక్తి - ఎచ్చెర్ల

పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి తెలిపారు. సిబ్బంది క్రమశిక్షణతో విధులు నిర్వర్తించి, ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్నారు. స్థానిక జిల్లా ఆర్మ్‌డ్ రిజర్వు పోలీస్ మైదానంలో శుక్రవారం నిర్వహించిన పోలీస్ పరేడ్‌లో గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిరోజూ కొంత సమయాన్ని వ్యాయామానికి కేటాయించాలని సూచించారు. మానసికంగా, శారీరకంగా దృఢంగా ఉన్నప్పుడే ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించగలమని తెలిపారు. చెడు అలవాట్లకు బానిస కాకుండా ఆరోగ్యంగా ఉండాలన్నారు. అనంతరం నిర్వహించిన ప్రత్యేక గ్రీవెన్స్‌లో పలువురు పోలీసు సిబ్బంది వ్యక్తిగత, ఉద్యోగ సమస్యలపై వినతులు అందజేశారు. ఎటువంటి సమస్యలున్నా తన దృష్టికి తీసుకురావాలని, సాధ్యాసాధ్యాలు బట్టి సమస్యలు పరిష్కరిస్తానని భరోసానిచ్చారు. కార్యక్రమంలో డిఎస్‌పి ఎల్.శేషాద్రి, ఆర్ఐ కె.నర్సింగరావు, ఎస్ఐలు, ఎఆర్, సివిల్ సిబ్బంది పాల్గొన్నారు.



సమస్యలు తెలుసుకుంటున్న ఎస్‌పి మహేశ్వర రెడ్డి

పోలీసు సిబ్బందికి వ్యాసరచన పోటీలు

పోలీసు అమరవీరుల స్మారక ఉత్సవాల్లో భాగంగా స్థానిక పోలీసు కమ్యూనిటీ హాల్‌లో పోలీస్ సిబ్బంది, వారి పిల్లలకు 'పర్యావరణ పరిరక్షణలో పోలీసులకు సవాళ్లు' అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అనంతరం పోలీసుల ఆయుధాలు, పరికరాలపై ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు.

సమస్యల పరిష్కారానికే ప్రజా దర్బార్

ప్రజాశక్తి - గార

ప్రజా సమస్యలను క్షేత్రస్థాయిలో పరిష్కరించుకునేందుకు వీలుగా వారి నుంచి వినతులను స్వీకరిస్తున్న కార్యక్రమమే ప్రజా దర్బార్ అని ఎమ్మెల్యే గొండు శంకర్ తెలిపారు. రాజకీయాలకు అతీతంగా ఎవరైనా నేరుగా తమ సమస్యను చెప్పుకునేందుకు వీలుందన్నారు. మండలంలోని తహశీల్దార్ కార్యాలయంలో అధికారులతో కలిసి శుక్రవారం ప్రజా దర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల గ్రామాల్లో ప్రతిఒక్కరూ సమస్యలతో సతమతమవుతున్నారని తెలిపారు. వ్యక్తిగత సమస్యలు, సామాజిక అవసరాలతో కూడిన సమస్యలు ఐదేళ్ల పాటు పరిష్కరించే వారు లేక ప్రజలు ఇబ్బందులు పడ్డారన్నారు. గ్రామాల్లో తాగునీరు, పారిశుధ్యం, విద్యుత్ వంటి కనీస మౌలిక సదుపాయాలనూ పట్టించుకోలేదన్నారు. గ్రామ పంచాయతీలకు కేటాయించిన ఆర్థిక సంఘం నిధులు సైతం దారిమళ్లించేశారని, దీనివల్ల పారిశుధ్య నిర్వహణ కష్టమైందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాలుగు నెలల్లోనే 15వ ఆర్థిక సంఘం నిధులను గ్రామ పంచాయతీలకు విడుదల చేసి అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. గ్రామసభలు నిర్వహించి అక్కడున్న సమస్యలను గుర్తించి అభివృద్ధి పనులకు పెద్దఎత్తున నిధులు ఇచ్చామన్నారు. ప్రాధాన్యతా క్రమంలో సమస్యల పరిష్కారానికి పల్లె పండగ కార్యక్రమంలో శంకుస్థాపనలు నిర్వహించామని చెప్పారు. గ్రామాల్లో పూర్తిస్థాయిలో అభివృద్ధి పనులు పెద్దఎత్తున మొదలయ్యాయన్నారు. ప్రజా దర్బార్‌లో వేలాదిగా వినతులు వస్తున్నాయని, వాటిని పరిష్కరించడానికి కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్, ఎంపిడిఒ, టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, పాల్గొన్నారు.




వినతులను స్వీకరిస్తున్న ఎమ్మెల్యే శంకర్

పెరుగుతున్న నెమళ్ల సంచారం

ప్రజాశక్తి - కవిటి

కవిటి మండలంలో నెమళ్ల సంచారం పెరుగుతోంది. మండలం లోని రాజపురం మోడల్ స్కూల్ వెనుక వైపు శుక్రవారం ఉదయం నెమళ్లు సంచరించడాన్ని గమనించిన పలువురు వాటిని తమ సెల్‌ఫోన్‌లో బంధించి సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేశారు. చిన్నా, పెద్దా ఎనిమిది నెమళ్లు తాము చూసినట్లు చెప్తున్నారు. ఇప్పటికే పుక్కళ్లపాలెం తీర ప్రాంతం సబుకు తోటల్లో నెమళ్ల సంచారాన్ని పలువురు గమనించారు. నెమళ్లు జనావాసాల్లోకి రావడం వల్ల వాటి ఉనికికి ప్రమాదం ఏర్పడుతుందని పక్షుల ప్రేమికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో చాలా ప్రాంతాల్లో నెమళ్లు సంచరిస్తున్నాయని, అటవీశాఖ అధికారులు వాటి సంరక్షణకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



రాజపురంలో సంచరిస్తున్న నెమళ్లు

సిఐటియు నాయకులపై కేసు కొట్టివేత

ప్రజాశక్తి - శ్రీకాకుళం లీగల్

రణస్థలం మండలంలోని అరబిందో ఫార్మా కంపెనీ సిఐటియు నాయకులపై పెట్టిన కేసును కోర్టు కొట్టివేసింది. ఛార్టర్ ఆఫ్ డిమాండ్లను నెరవేర్చాలని 2019లో సిఐటియు ఆధ్వర్యాన అరబిందో ఫార్మా కార్మికులు పరిశ్రమ గేటు వద్ద ఆందోళన చేపట్టారు. పరిశ్రమకు ఉద్యోగులు, కార్మికులను రానీయకుండా అడ్డుకుంటున్నారన్న పేరిట యాజమాన్యం పోలీసులకు ఫిర్యాదు చేసింది. సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిహెచ్.అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు, గురునాయుడుతో పాటు 16 మందిపై జె.ఆర్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ కేసుకు సంబంధించిన విచారణలో నేరం రుజువు కాకపోవడంతో, కోర్టు కొట్టివేసిందని సిఐటియు నాయకుల తరుపున వాదించిన న్యాయవాది దుంపల రమణారావు తెలిపారు.

పాడి రైతుల అభివృద్ధికే పశుగణన

రాష్ట్ర పశుసంవర్ధకశాఖ మంత్రి అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి - కోటబొమ్మాళి

పాడి రైతుల అభివృద్ధికి పశుగణన కార్యక్రమం దోహదపడుతుందని రాష్ట్ర పశు సంవర్ధకశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. 21వ అఖిల భారత పశు గణనలో భాగంగా వచ్చే ఏడాది ఫిబ్రవరి 28వ తేదీ వరకు రాష్ట్రంలోని 1.50 కోట్ల కుటుంబాలకు చెందిన 16 రకాల పశువుల వివరాలను నమోదు చేయనున్నట్లు తెలిపారు. మండలంలోని మండలం పెద్దబమ్మిడిలో పశు గణన కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ గణనలో వ్యవసాయ పరికరాల వివరాలనూ సేకరిస్తారని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో రైతులు, భూమిలేని కుటుంబాలకు ప్రధాన ఆదాయ వనరుగా ఉన్న పశుసంవర్ధక రంగాన్ని మెరుగుపరచడానికి అవసరమయ్యే నిధులు, పథకాల రూపకల్పన, అమలు, పర్యవేక్షణకు ఇది దోహదపడుతుందన్నారు. పశుగణన పూర్తయిన ఇంటి తలుపుపై స్టిక్కర్ వేస్తామన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధికి పెద్దపీట వేస్తోందన్నారు. ఈ దీపావళి నుంచి ప్రతి నాలుగు నెలలకు ఒకటి చొప్పున మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లను ఇవ్వనున్నట్లు చెప్పారు. తల్లికి వందనం పథకాన్ని జనవరిలో ఇచ్చేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. రైతులకు పెట్టుబడి సాయం కూడా వీలైనంత త్వరగా ఇచ్చేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఆర్థిక వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉన్నా.. అన్ని వ్యవస్థలను గాడిలో పెట్టి ముందుకు సాగుతున్నామన్నారు. కార్యక్రమంలో పశుసంవర్ధకశాఖ శాఖ జాయింట్ డైరెక్టర్ ఆర్.మురళీధర్, డివిజనల్ డిప్యూటీ డైరెక్టర్ వి.జయరాజ్, జిల్లా జనాభా లెక్కల నోడల్ అధికారి జి.నారాయణరావు, అసిస్టెంట్ డైరెక్టర్ ఎం.లోకనాథం, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ ఎం.ప్రజ్ఞాచైతన్య, పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు కింజరాపు హరివరప్రసాద్, మాజీ ఎంపిపిలు వెలమల విజయలక్ష్మి, కామేశ్వరరావు, టి.రామకృష్ణ, పశువైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

వర్గీకరణతో రాజ్యాధికారానికి దూరం

ఎస్‌సి, ఎస్‌టి జెఎసి నాయకులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

దేశంలో దళితుల ఐక్యతను దెబ్బతీయడంతో పాటు రాజ్యాధికారానికి దూరం చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వర్గీకరణను తెర పైకి తెచ్చాయని ఎస్‌సి, ఎస్‌టి జెఎసి నాయకులు కళ్లేపల్లి రామ్‌గోపాల్, కంఠ వేణు, తైక్వాండో శ్రీను విమర్శించారు. నగరంలో శుక్రవారం విలేకరులతో వారు మాట్లాడారు. హక్కులను సాధనకు మాలల నాయకత్వాన ఉద్యమించాలని పిలుపునిచ్చారు. వర్గీకరణను వ్యతిరేకిస్తూ ఎస్‌సి రిజర్వేషన్ల పరిరక్షణకు, క్రిమిలేయర్‌కు వ్యతిరేకంగా ఈనెల 27న పలాసలో రైల్వే ఇన్‌స్టిట్యూట్ వద్ద అవగాహనా సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సభకు మాజీ ఎంపీ హర్షకుమార్, హైదరాబాద్‌కు చెందిన రిటైర్డ్ ఐఎఎస్ అధికారి పి.ఎస్.ఎన్ మూర్తి, విశాఖ ఆంధ్రా యూనివర్సిటీ ప్రొఫెసర్ జాన్ హాజరు కానున్నట్టు తెలిపారు. ఈ సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. జనాభాలో ఐక్యంగా ఉన్న 25 శాతం మంది మధ్య వర్గీకరణ చిచ్చు పెట్టి రాజకీయ లబ్ధి పొందాలని పాలకులు చూస్తున్నారని ధ్వజమెత్తారు. వర్గీకరణ మాటున క్రిమీలేయర్ కుట్ర సాగుతోందన్నారు. దీనివల్ల ఎస్‌సి, ఎస్‌టిలోని కులాలకు ముప్పు పొంచి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆర్టికల్ 341 ప్రకారం ఏదైనా ఒక కులాన్ని షెడ్యూల్ కులాల జాబితాలో చేర్చాలన్నా, తీసివేయాలన్నా పార్లమెంట్‌కు మాత్రమే అధికారం ఉందన్నారు. రిజర్వేషన్ తగ్గించే అధికారం పార్లమెంటుకు లేదన్నారు. ఎస్‌సిలను వర్గీకరించే అధికారం రాష్ట్రపతికి లేదన్నారు. వర్గీకరణపై ఆగస్టు ఒకటో తేదీన సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు రాజ్యాంగ వ్యతిరేకమన్నారు.



మాట్లాడుతున్న ఎస్‌సి, ఎస్‌టి జెఎసి నాయకులు

ఆర్‌బిఐ క్విజ్ పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా ఈనెల 28న విజయవాడలో నిర్వహించబోయే రాష్ట్రస్థాయి క్విజ్ పోటీల్లో పాల్గొనేందుకు జిల్లా నుంచి నలుగురు విద్యార్థులు ఎంపికయ్యారు. వారిలో ఆర్ట్స్ కళాశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు కాగా, మరో ఇద్దరు ఎచ్చెర్ల ట్రిపుల్ ఐటి విద్యార్థులు ఎంపికయ్యారు. పలు కళాశాలల నుంచి వెయ్యి మంది పోటీ పడగా, వారిలో నలుగురు రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారని ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సురేఖ తెలిపారు. రాష్ట్రస్థాయి క్విజ్ పోటీ బ్యాంకింగ్, ఆర్థిక వ్యవస్థ, మౌలిక ఆర్థిక అంశాలు, భారత ఆర్థిక విధానాలు, సామాన్య జ్ఞానంపై ఆధారపడి ఉంటాయని చెప్పారు. విద్యార్థులు కృషి, పట్టుదలతో రాష్ట్రస్థాయిలో బహుమతి సాధించాలని ఆకాంక్షించారు. క్విజ్ పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో జిల్లా లీడ్‌బ్యాంకు మేనేజర్ సూర్యకిరణ్ పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ సురేఖ

హాస్టళ్లలో ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

నగరంలోని పలు వసతిగృహాలను జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసి నాయుడు శుక్రవారం ఆకస్మిక తనిఖీలు చేశారు. ప్రభుత్వ గిరిజన సంక్షేమ వసతిగృహం, బిసి బాలుర హాస్టల్, శ్రీకాకుళం రూరల్ మండలం సింగుపురంలోని బిసి హాస్టల్‌లో మధ్యాహ్న భోజన పథకం అమలుపై ఆరా తీశారు. వంట గదికి వెళ్లి ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించారు. పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. దీనివల్ల వ్యాధులకు దూరంగా ఉండవచ్చన్నారు. అనంతరం చట్టాలపై అవగాహన కల్పించారు.



హాస్టల్‌లో వంటగదిని పరిశీలిస్తున్న సన్యాసినాయుడు

జాబ్‌మేళాకు స్పందన

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ప్రభుత్వ డిఎల్‌టిసి, ఐటిఐ ప్రాంగణంలో శుక్రవారం నిర్వహించిన జాబ్‌మేళాలో 48 మందికి ఉద్యోగాలు లభించాయి. జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ సహకారంతో నిర్వహించిన ఈజాబ్‌మేళాలో 106 మంది రాత పరీక్షకు, ఇంటర్వ్యూకు హాజరయ్యారు. ఈ మేళాలో మోడలైజ్ ఇండియా ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్, ఎన్.ఎస్ ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, కొల్గేట్ పామోలివ్, అపోలో టైర్స్ సంస్థల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఇంటర్వ్యూల అనంతరం ఎంపికైన వారు ఆయా సంస్థల్లో ఉద్యోగ నియామకాలు చేపట్టనున్నట్లు డిఎల్‌టిసి ఎడి వై.రామ్మోహనరావు తెలిపారు. జాబ్‌మేళాలో జిల్లా ఉపాధి అధికారి కొత్తలంక సుధ, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి సాయికుమార్, కంపెనీల ప్రతినిధులు హాజరయ్యారు.



మాట్లాడుతున్న రామ్మోహనరావు


మాట్లాడుతున్న అచ్చెన్నాయుడు

కార్యకర్తలే పార్టీకి కీలకం

కోటబొమ్మాళి: తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే పట్టుకొమ్మలని, 40 ఏళ్లుగా ఎంతమంది నేతలు మారుతున్నా కార్యకర్తలు మాత్రం చెక్కు చెదరలేదని రాష్ట్ర వ్యవసాయ శాఖామంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. శుక్రవారం స్థానిక ఎన్‌టిఆర్ భవన్‌లో నియోజకవర్గ స్థాయి ముఖ్య నాయకులు, క్రియాశీలక సభ్యులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సారి సభ్యత్వ నమోదు కార్యక్రమం ఎవరికి వారే స్వచ్ఛందంగా వచ్చి నమోదు చేసుకోవాలని, టెక్కలి నియోజకవర్గం సభ్యత్వ నమోదులో రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో ఉండాలన్నారు. గతంలో సభ్యత్వ నమోదు చేసిన వారికి ప్రమాదభీమా రూ.లక్ష ఉండేది, ఇప్పుడు రూ.5లక్షలకు పెంచామన్నారు. ఇతర పార్టీల వారు సభ్యత్వ నమోదుకు అర్హులు కాదని, ఎన్నికల ముందు పార్టీలోకి వచ్చిన వారికే ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో మాజీ పిఎసిఎస్ అధ్యక్షుడు కింజరాపు హరివరప్రసాద్, రాష్ట్ర టిడిపి కార్యదర్శి బోయిన గోవిందరాజులు, టిడిపి నాయకులు పినకాన అజయ్‌కుమార్, బగాది శేషు, బోయిన రమేష్, జీరు భీమారావు, అప్పారావు, ఎల్‌ఎల్ నాయుడు, విజయలక్ష్మి, దమయంతి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా అటవీశాఖాధికారి వెంకటేష్

క్రమశిక్షణతో మెలగాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం రూరల్

ప్రతి విద్యార్థి క్రమశిక్షణ కలిగి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని జిల్లా అటవీ శాఖాధికారి వెంకటేష్ అన్నారు. మండలంలోని నైరా ఆచార్య ఎన్‌జిరంగా వ్యవసాయ కళాశాలలో నూతన విద్యా విధానంలో భాగమైన దీక్షారంభం 2024 మూడవ రోజు నైరా వ్యవసాయ కళాశాల మొదటి సంవత్సరం విద్యార్థులకు భవిష్యత్ ప్రణాళికలు ఎలా సిద్ధం చేసుకోవాలన్న దానిపై విద్యార్థులతో ముఖాముఖి చర్చించారు. వ్యవసాయ విద్య వివిధ పోటీ పరీక్షలకు సన్నద్ధం కావడానికి చాలా అనువైందన్నారు. ముఖ్యంగా సివిల్ సర్వీసెస్ అఖిల భారత అటవీ సర్వీస్ గ్రూప్ 1, గ్రూప్ 2 వంటి పరీక్షలకు విద్యార్థులు సులభంగా సన్నద్ధం కావచ్చునని వివరించారు. కార్యక్రమంలో కళాశాల అసోసియేట్ డిన్ డాక్టర్ ఎం.భరత లక్ష్మి, ఒఎస్ఎ డాక్టర్ డి.చిన్నం నాయుడు, బోధనా సిబ్బంది పాల్గొన్నారు.


నినాదాలు చేస్తున్న సిపిఎం నాయకులు

సిపిఎం మహాసభలను జయప్రదం చేయాలి

కోటబొమ్మాళి: సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు నంబూరు షణ్ముఖరావు పిలుపుమేరకు పలాసలో నవంబర్ 9, 10 తేదీల్లో జరిగే జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని మండల సిపిఎం కార్యదర్శి హనుమంతు ఈశ్వరరావు అన్నారు. శుక్రవారం స్థానిక సిపిఎం కార్యాలయంలో నాయకులు బోర శ్రీను అధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. మండల కార్యదర్శిగా హెచ్.ఈశ్వరరావును మండల మహాసభకు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఈశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలను, నిత్యావసర వస్తువుల ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఆనందరావు, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్

ప్రజల ఆరోగ్యంపై మరింత శ్రద్ధ

శ్రీకాకుళం అర్బన్: జిల్లాలో ప్రజల ఆరోగ్యానికి వైద్యులు పూర్తి సహాయ సహకారాలు అందించి మెరుగైన ఆరోగ్యవంతమైన సమాజాన్ని రూపొందించాలని రాజాం ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ అన్నారు. శుక్రవారం నగరంలోని బ్లూఎర్త్ హోటల్‌లో భాను యూరో కేర్, హారికా డెంటల్ మల్టీ స్పెషాలిటీ సంయుక్తంగా ఉత్తరాంధ్ర జిల్లాల గ్రామీణ వైద్యుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన హాజరై మాట్లాడారు. గ్రామీణ వైద్యుల సహకారంతో ప్రజలకు దగ్గరవ్వాలన్న డాక్టరు భానుమూర్తి చేసిన ప్రయత్నం అభినందనీయమన్నారు. డాక్టర్ భానుమూర్తి మాట్లాడుతూ భాను యూరోకేర్, హారిక డెంటల్ మల్టీ స్పెషాలిటీ క్లినిక్‌లో అధునాతనమైన పరికరాలతో మంచి వైద్యం అందించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో దంత వైద్యులు డాక్టర్ హారిక, గ్రామీణ వైద్యుల సంఘం జిల్లా అధ్యక్షులు సిహెచ్ ఉమామహేశ్వర్ రెడ్డి, ఉత్తరాంధ్ర అధ్యక్షులు జంగం జోషి, గౌరవ అధ్యక్షులు ముమ్మల తిరుపతిరావు, రాజాం డివిజన్ అధ్యక్షులు చౌదరి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాలపై స్టిక్కర్లు

ఇచ్ఛాపురం: పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం జ్ఞానభారతి ఎడ్యుకేషనల్ ట్రస్ట్ సెక్రటరీ జోహార్‌ఖాన్ ఆధ్వర్యంలో పాఠశాల ఆవరణలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది ద్విచక్ర వాహనాలకు పోలీస్ అమరవీరుల సంస్కరణ దినోత్సవ పోలీస్ ఫ్లాగ్ డే స్టిక్కర్లను అతికించారు. పోలీసు అమరవీరులకు జోహార్ అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా జోహార్ ఖాన్ మాట్లాడుతూ పోలీసులు సమాజానికి అత్యుత్తమ సేవలు అందిస్తున్నారని, తీవ్రవాదుల నుంచి సమాజాన్ని కాపాడేందుకు ప్రాణాలు సైతం త్యాగం చేస్తుంటారన్నారు. వారి త్యాగ నిరతికి గుర్తుగా నిర్వహిస్తున్న పోలీస్ అమరవీరుల సంస్కరణ వారోత్సవాలను పురస్కరించుకొని వివిధ కార్యక్రమాలను పాఠశాలలో నిర్వహించామన్నారు. కార్యక్రమంలో. ట్రస్టీ వజ్రపు రమణమూర్తి, ప్రిన్సిపాల్ ఐబి పండా, హెడ్ మిస్ట్రెస్ రషీదా సుల్తానా, మేనేజర్ ప్రమోద్ కుమార్, అదనపు పరిపాలనాధికారి సయ్యదా సుల్తానా, ట్రాన్స్‌పోర్ట్ మేనేజర్ అలీమ్ ఖాన్, వ్యాయామ ఉపాధ్యాయులు కైలాష్ పండా, మదీనా తదితరులు పాల్గొన్నారు.


ఫ్లాగ్ డే స్టిక్కర్లు అతికిస్తున్న జోహార్ ఖాన్

యథేచ్ఛగా ఎర్రమట్టి తరలింపు


సంగమేశ్వర స్వామి కొండ వద్ద తవ్వేసిన ఎర్రమట్టి

- కొండలను పిండి చేస్తూ అక్రమార్జన
- రియల్ వెంచర్లకు అమ్ముకుంటున్న వైనం
- చోద్యం చూస్తున్న అధికార యంత్రాంగం

ప్రజాశక్తి- ఆమదాలవలస

మండల పరిధిలో మట్టి మాఫియా చెలరేగుతూ కొండలు, గుట్టలను సైతం పిండి చేస్తూ ఎటువంటి అనుమతులు లేకుండా యథేచ్ఛగా ఎర్ర మట్టిని తరలిస్తూ చెలరేగిపోతున్నారు. మండలంలోని గాజుల కొల్లివలస జగనన్న కాలనీ లే అవుట్ వెనుక భాగాన సర్వేనెంబర్ 183లోని సంగమేశ్వర స్వామి కొండకు గుండు కొడుతూ అక్రమంగా లారీలతో ఎర్ర మట్టిని తరలించుకు పోతున్నప్పటికీ గనులశాఖ, మండల స్థాయి అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తూ చోద్యం చూస్తూ ఉండడంపై పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. గాజులు కొల్లివలస జగనన్న కాలనీ పక్కనే ఉన్న అనధికార క్వారీని కేంద్రంగా చేసుకొని కొండలను పిండి చేస్తూ ఎర్రమట్టిని ఇష్టారాజ్యంగా తరలిస్తున్నప్పటికీ కూత వేటు దూరంలో ఉన్న సచివాలయ పక్కనుంచి ఎర్రమట్టి లారీలు వెళ్తున్నప్పటికీ కనీసం స్పందించకపోవడం పలు రకాల అనుమానాలకు తావిస్తుందని సమీప గ్రామాల ప్రజలు వాపోతున్నారు. మట్టిని తరలించాలంటే కార్యదర్శి, రెవెన్యూ అధికారుల అనుమతి తప్పనిసరి అయినప్పటికీ ఎటువంటి అనుమతులు లేకుండా యథేచ్ఛగా లారీలతో తరలిస్తున్నారు. అలికాం, బత్తిలి రహదారికి దగ్గరలో ఉన్న వంశధార కాలువ పక్కన నూతనంగా వేస్తున్న రియల్ ఎస్టేట్ వెంచర్ యజమానులకు, మున్సిపాలిటీలోని రెండవ వార్డు కష్టాపురానికి చెందిన ఓ వ్యక్తి దర్జాగా రాజులా ఎర్రమట్టిని విక్రయిస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడం పలువురిని విస్మయానికి గురి చేస్తుంది. ప్రభుత్వం ఒకవైపు మట్టి మాఫియాపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరిస్తున్నప్పటికీ అది ప్రకటనలకే పరిమితమవుతున్నాయని పలువురు పేర్కొంటున్నారు. ప్రభుత్వానికి ఎటువంటి రాయల్టీ చెల్లించకుండా యథేచ్ఛగా ఎర్ర మట్టిని తరలించుకు పోవడంపై పర్యావరణ ప్రేమికులు, సమీప గ్రామాల ప్రజలు అధికారుల ప్రభుత్వ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొండల పూర్వపు స్వరూపం మారిపోతున్నప్పటికీ అధికారులు పట్టించుకోకుండా ఉన్నతాధికారులకు మాత్రం గుర్తు తెలియని వ్యక్తులు మట్టి తవ్వకాలు జరిపి తరలిస్తున్నారని నివేదికలు ఇస్తున్నారని సంబంధిత సిబ్బంది చెబుతుండడం విశేషం.


అక్రమంగా టిప్పర్‌తో తరలిస్తున్న ఎర్ర మట్టి

పైసా వసూల్

క్షేత్రస్థాయి సిబ్బందితో ముందుగా మాట్లాడుకునే తాము మట్టిని తరలిస్తున్నామని ఇంత బహిరంగంగా తాము తవ్వుతుంటే ఎవరైనా అడ్డుకోకుండా ఉంటారా అని మట్టి మాఫియా నేతలు తిరిగి ప్రశ్నిస్తుండడం విశేషం. అందుకే అధికారులు ఎవరు తమను ప్రశ్నించడం లేదని మట్టి మాఫియాకు చెందిన ఓ వ్యక్తి చెప్పడం విశేషం. ఎవరి వాటా వారికి ఇచ్చేసాం, లైన్ క్లియర్ అంటూ అక్కడి నుంచి ఆ వ్యక్తి వెళ్లిపోయారు.

ఇదే విషయమై గనులు శాఖ ఎడి మోహనరావును వివరణ కోసం పలుమార్లు ఫోన్‌లో సంప్రదించగా ఆయన స్పందించ లేదు. గనులశాఖ ఆర్ఐ మాణిక్యాల రావును ప్రశ్నించగా తాము దానిపై ఏమి మాట్లాడకూడదని, ఆ విషయంపై ఉన్నతాధికారులతో మాట్లాడుకోవాలని సూచించారు.


కొత్తూరు : విద్యార్థులతో మాట్లాడుతున్న ఉప విద్యాశాఖాధికారి

ఆశ్రమ పాఠశాలల పరిశీలన

ప్రజాశక్తి- కొత్తూరు

మండలంలోని గొట్టిపల్లి ఆశ్రమ పాఠశాలను సీతంపేట ఐటిడిఎ ఉప విద్యా శాఖాధికారి పి.నారాయుడు, ఎ.ఎం కోటిబాబు ఆకస్మిక తనిఖీ చేపట్టారు. విద్యార్థుల విద్యా ప్రమాణాలు, విద్యార్థులకు ప్రభుత్వం ద్వారా అందుతున్న వసతులను పరిశీలించి పలు సూచనలు చేశారు. మెనూ పటిష్ఠంగా అమలు చేయాలని ఆదేశించారు. వీరితో పాటు హెచ్‌ఎం చంద్రకుమార్ ఉన్నారు.

మెళియాపుట్టి: సీతంపేట ఐటిడిఎ పరిధిలో ఉన్న బందపల్లి, పిఎల్‌పురం ఆశ్రమ పాఠశాలలను ఐటిడిఎ ఎపిఒ జి.చిన్నబాబు శుక్రవారం పరిశీలించారు. బందపల్లి ఆశ్రమ పాఠశాల నిర్వహణ బాగుందని, కిచెన్ గార్డెన్ బాగుందన్నారు. మెనూ ప్రకారం భోజనాలు పెడుతున్నారని, భోజనం కూడా రుచిగా ఉందని, పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉన్నాయన్నారు. అలాగే పిఎల్‌పురం ఆశ్రమ పాఠశాలను పరిశీలించారు. పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలని సూచించారు. ఈయనతో పాటు పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయ సిబ్బంది ఉన్నారు.

ఘనంగా అయోడిన్ రుగ్మతల
లోప నివారణ దినోత్సవం

పలాస: మనం నిత్యం వినియోగించే ఉప్పులో అయోడిన్ ఉండేలా చూసుకోవాలని, లేదంటే థైరాయిడ్ బారిన పడే అవకాశం ఉందని ఉపాధ్యాయులు విద్యార్థులకు సూచించారు. మండలం బ్రాహ్మణతర్లా జెడ్‌పి హైస్కూల్లో శుక్రవారం ఈ నెల 21 నుంచి 27 వరకూ అయోడిన్ అవగాహన వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు అయోడిన్‌పై అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. అయోడిన్ సూక్షపోషకమని, దీని వాడకం తగ్గితే థైరాయిడ్ లోపం ఏర్పడి జ్ఞాపక శక్తి మందగించి గాయిటర్ వ్యాధిన పడే అవకాశం ఉందన్నారు. హెచ్‌ఎం ఎస్.వి.రమణారావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ సౌజన్యకు అంతర్జాతీయ పురస్కారం

శ్రీకాకుళం అర్బన్ : నగరంలోని తంగి సత్యనారాయణ డెంటల్ ఆస్పత్రి యజమాని, దంత వైద్య నిపుణులు డాక్టర్ తంగి సౌజన్యకు ఇంటర్నేషనల్ బెస్ట్ రీసెర్చర్ అవార్డు దక్కింది. చెన్నైలో గురువారం జరిగిన ఆసియా రిసెర్చ్ అవార్డు-2024 అవార్డుల ప్రదానోత్సవంలో తమిళనాడు రాష్ట్ర విద్యాశాఖామంత్రి అంబిల్ మహేష్ పొయ్యమోజీ చేతులమీదుగా ఈ పురస్కారాన్ని ఆమె అందుకున్నారు. ఆసియా రిసెర్చ్ అవార్డు-2024లో దంత వైద్యానికి సంబంధించి ఆమె రాసిన పరిశోధనాత్మక కథనాన్ని జనరల్‌లో ప్రచురించారు. ప్రచురించిన కథనాన్ని పరిశీలించిన అవార్డు కమిటీ అవార్డుకు ఆమె పేరును ఎంపిక చేసి అందించారు.



అవార్డును స్వీకరిస్తున్న సౌజన్య

త్వరితగతిన పరిష్కారం చూపాలి

ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి

పలాస: కాశీబుగ్గ పోలీసు స్టేషన్‌లో ఎస్‌పి కె.వి.మహేశ్వర రెడ్డి శుక్రవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 15 వినతులు స్వీకరించినట్టు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిర్యాదుదారుల సమస్యలను తెలుసుకొని పూర్తిస్థాయిలో పరిష్కరిస్తామన్నారు. ఫిర్యాదుదారుల అర్జీలు, వారి వివరాలు సంబంధిత పోలీసు అధికారులకు ఫోన్ ద్వారా తెలియ పర్చి చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. ప్రజా పిర్యాదులపై అత్యంత ప్రాధాన్యత ఇస్తూ, త్వరితగతిన పరిష్కారం చూపాలని సూచించారు. ఆయా ఫిర్యాదులపై తీసుకున్న చర్యలను నిర్ణీత సమయంలో జిల్లా పోలీస్ కార్యాలయానికి నివేదిక రూపంలో పంపించాలని ఎస్‌పి ఆదేశించారు.


ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్‌పి మహేశ్వర రెడ్డి


బూర్జ : మాట్లాడుతున్న రామకృష్ణ

భూ సమస్యల పరిష్కారమే లక్ష్యం

పోలాకి: భూ సమస్యల పరిష్కారమే లక్ష్యమని తహాశీల్దార్ ఎం.సురేష్ కుమార్ అన్నారు. శుక్రువారం ఉరజాం సచివాలయంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ కణితి సత్తిబాబు, మాజీ సర్పంచ్ రోణంకి నర్సింగరావు, విఆర్‌ఒలు, సచివాలయ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

బూర్జ: మండలంలో పెద్దపేట పంచాయతీలో భూ సమస్యలపై ఎపి మార్క్‌ఫెడ్ డైరెక్టర్, మాజీ జెడ్‌పిటిసి ఆనెపు రామకృష్ణ ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. రెవెన్యూ పరిధిలో ఉన్న వివిధ భూముల రీసర్వే సమస్యలపై ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో తాహాశీల్దార్ పద్మావతి, మండల బిసి సెల్ అధ్యక్షులు మామిడి దుర్గారావు, కడగల కృష్ణ, మజ్జి అప్పలనాయుడు, చంద్రమౌళి, నారాయణరావు, పొగిరి మణికంఠ దాసిరెడ్డి వెంకు నాయుడు, అధికారులు పాల్గొన్నారు.

వసతిగృహాల తనిఖీ

ప్రజాశక్తి- కొత్తూరు

మండలంలో వసపలో ఉన్న కెజిబివి పాఠశాలను శుక్రవారం జూనియర్ సివిల్ జడ్జి ఎస్.మణి తనిఖీ చేశారు. పాఠశాల ఆవరణ, వంట పాత్రలు, వంట చేసే ప్రదేశం, మరగు దొడ్లు, తలుపులు, విద్యుత్, సిసి కెమేరాలు అన్ని సక్రమంగా ఉన్నది లేనిది పరిశీలించారు. మౌలిక వసతులు సక్రమంగా ఉండేలా చూడాలని ప్రత్యేకాధికారి పి.రాధికకు సూచించారు.

పొందూరు: మండలంలోని కింతలి, తాడివలస బిసి బాలుర వసతి గృహాలను జూనియర్ సివిల్ జడ్జి బి.జ్యోత్స్న ఆకస్మిక తనికీ చేశారు. విద్యార్థుల చదువుతో పాటు, ఆరోగ్యంపై వసతిగృహ సంక్షేమాధికారులు శ్రద్ధ చూపాలని ఆదేశించారు. అనంతరం వసతి గృహంలో సమస్యలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈమెతో పాటు వసతిగృహం సంక్షేమాధికారులు యతిరాజులు, దాసునాయుడు, న్యాయవాదులు అశోక్, రాము ఉన్నారు.


పొందూరు : వసతిగృహాన్ని పరిశీలిస్తున్న జడ్జి జ్యోత్స్న

దేశ ప్రగతిలో విద్యార్థుల నైపుణ్యం కీలకం

నరసన్నపేట: దేశ ప్రగతిలో విద్యార్థుల నైపుణ్యం ఎంతో కీలకమని అంబేద్కర్ యూనివర్సిటీ బిసిడిఇ సమన్వయకర్త ప్రొఫెసర్ బి.అజయ్ కుమార్ అన్నారు. శుక్రవారం రాష్ట్ర ఉన్నత విద్యా మండలి బిసిడిఇ (బోర్డ్ ఫర్ కమ్యూనిటీ డెవలప్మెంట్ త్రు ఎడ్యుకేషన్), అంబేద్కర్ యూనివర్సిటీ సంయుక్తంగా పద్మావతి డిగ్రీ కళాశాలలో లిప్ (లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రాం) పై విద్యార్థులకు ఒక్కరోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల వలన సామాజిక సేవ మెరుగ్గా జరుగుతుందని, విద్యార్థులు తలుచుకుంటే దేశం ప్రగతి పథంలోకి వెళ్లడం తథ్యమన్నారు. శిక్షణా ఫౌండేషన్ ప్రతినిధి ఆర్.అప్పారావు మాట్లాడుతూ విద్యార్థులకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతో స్ఫూర్తినిస్తాయని, విద్యార్థుల కనీస సామర్థ్యాలు పెంచడమే ఈ కార్యక్రమం ఉద్దేశ్యమన్నారు. కళాశాల డైరక్టర్ సిహెచ్ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ చదువు, మార్కులు, ఉద్యోగమే కాకుండా సమాజంలో ఉన్న సమస్యలపై విద్యార్థులకు అవగాహన కల్పించే ఉద్దేశంతో కమ్యూనిటీ సర్వీస్ ప్రాజెక్ట్‌ను అమలు చేయడం జరుగుతుందన్నారు. కళాశాల ఇన్‌ఛార్జి ఎం. శ్రీనివాసరావు, కళాశాల బిసిడిఇ కో-ఆర్డినేటర్ కె.రాము, విద్యార్థులు పాల్గొన్నారు.

చేపల పెంపకంలో అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి- ఆమదాలవలస

చేపల పెంపకంలో అప్రమత్తత అవసరమని కెవికె ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ కె. భాగ్యలక్ష్మి అన్నారు. శుక్రవారం పట్టణంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో జాతీయ మత్స్య అభివృద్ధి మండలి హైదరాబాద్, కృషి విజ్ఞాన కేంద్రం సంయుక్తంగా స్వదేశీ మత్స్యకార సహకార సంఘ సభ్యులకు వృత్తి విద్యా శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చేపల పెంపకంలో వాతావరణ ప్రభావం అధికంగా ఉంటుందని, అప్రమత్తత చాలా ముఖ్యమన్నారు. మత్స్య శాస్త్రవేత్త డాక్టర్ సిహెచ్ బాలకృష్ణ మాట్లాడుతూ సహజ మంచినీటి వనరుల్లో చేపల దిగుబడికి నేల, నీరు గుణాల యాజమాన్యం చాలా కీలకమన్నారు. రైతులు చేప పిల్లల పెంపకం చేపట్టడంలో నూతన పద్ధతులను ఆచరించి ఆదాయ మార్గాలను ఏర్పరచుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో స్వదేశీ మత్స్యకార సహకార సంఘ సభ్యులు, మత్స్య సహాయకుడు భాస్కర్, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు జిఎస్ రాయ్, సునీత, హరికుమార్, కిరణ్, అనూషా పాల్గొన్నారు.

పశువుల పెంపకంతో ఆర్థికాభివృద్ధి


పలాస : పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జాయింట్ కలెక్టర్

ప్రజాశక్తి- పోలాకి

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పశుగణనకు రైతులు ప్రత్యేక శ్రద్ధ వహించి సహకరించాలని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. శుక్రువారం మబగాంలో ఎమ్మెల్యే పశు గణన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశు పోషణ, పశుసంపద అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. పశుసంపదపై ప్రత్యేక పథకాలు అమలు చేయాలంటే పశుగణన జరగాలన్నారు. దేశవ్యాప్తంగా 25 అక్టోబర్ 2024 నుంచి 28 ఫిబ్రవరి 2025 వరకు 21 వ అఖిల భారత పశు గణన చేపట్టేందుకు పశు సంవర్ధక శాఖ సిద్ధమైందని వివరించారు. కార్యక్రమంలో మండల పశువైద్యాధికారులు ఎస్.అనిల్ కుమార్, మల్లేశ్వరరావు, పద్మప్రియ, అప్పన్న పాల్గొన్నారు.

శ్రీకాకుళం రూరల్: పశువుల పెంపకం కీలకమైన ఆర్థిక వనరని, ఇది జాతీయ ఆర్థిక వ్యవస్థ అభివృద్ధికి దోహదపడుతుందని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. మండలంలోని కిష్టప్పపేటలో తన నివాసంలో పశుగణన పోస్టర్‌ను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. కార్యక్రమంలో సహాయ సంచాలకులు దా.పి.ఎస్.జి .బాలకృష్ణ, వై.వి.కృష్ణారావు, పశు వైద్యాధికారి తిరుపతిరావు, అరసవల్లి, కళింగపట్నం పశు వైద్యాధికారులు డా.దిలీప్, జ్యోత్స్న, పశుసంవర్ధక సహాయ సిబ్బంది అజిత్, మోహన్, అర్జున్, మధు స్థానిక సర్పంచ్ అరసవల్లి సత్యవతి పాల్గొన్నారు.

పలాస: స్థానిక రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో పశుగణన పోస్టర్‌ను జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు పి.చంద్రశేఖర్, తహాశీల్దార్ కళ్యాణ చక్రవర్తి, మధుబాబు, విఎఎస్‌లు పాల్గొన్నారు.

రణస్థలం రూరల్: స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో రూపొందించిన పశుగణన పోస్టర్‌ను ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు ఆవిష్కరించారు. కార్యక్రమంలో సబ్ డివిజన్ సహాయ సంచాలకులు బి.దుర్గారావు, వైద్యాధికారులు లావణ్య, గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

ఆమదాలవలస : పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద పశువైద్య సహాయ సంచాలకులు డాక్టర్ రోణంకి ఆనందరావు కమిషనర్, టిడిపి నాయకులతో కలిసి పశుగణన పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ పూజారి బాలాజీ ప్రసాద్, టిడిపి లీగల్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మినేని విద్యాసాగర్, పివివికె రాజు, మాజీ మున్సిపల్ కౌన్సిలర్లు గురువుబెల్లి నాగేశ్వరరావు, బొడ్డేపల్లి లక్ష్మణరావు, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.


పోలాకి : పశుగణనను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తి


రణస్థలం రూరల్ : పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ఈశ్వరరావు


గాయపడిన సంతోష్ కుమార్

వ్యక్తికి గాయాలు

లావేరు: మండలంలోని బుడుమూరు కూడలి ఇందిరాగాంధీ విగ్రహం సమీపంలోని జాతీయ రహదారి వంతెనపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వంతెనపై నుంచి కిందకు పడి వ్యక్తి గాయాలపాలైన సంఘటన చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు బుడుమూరు గ్రామ సమీపంలో జాతీయరహదారి వంతెనపై రోడ్డు పనులు పర్యవేక్షిస్తున్న జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన సంతోష్ కుమార్ రహదారి ప్రక్కన విధినిర్వహణలో ఉండగా శ్రీకాకుళం వైపు నుంచి విశాఖపట్నం వెళ్తున్న ఆటో సంతోష్ కుమార్‌ను బలంగా ఢీకొనడంతో వంతెన పైనుంచి సుమారు 50 అడుగుల లోతులో కింద సర్వీస్ రోడ్డుపై పడిపోవడంతో కాళ్లు, చేతులు విరిగిపోగా తలకు తీవ్రంగా గాయపడటంతో 108 సహాయంతో శ్రీకాకుళం మెడికవర్ ఆస్పత్రికి తరలించారు. అయితే పరిస్థితి విషమంగా ఉంది. లావేరు పోలీసులు ఘటనా స్థలికి చేరుకొని కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సి పొదిలాపు రామారావు తెలిపారు. ఆటో డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నామని తెలిపారు.



ఒకవైపు ఒరిగిపోయిన ప్రయివేటు బస్సు

త్రుటిలో తప్పిన ప్రమాదం

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

మండలం ఆంధ్ర- ఒడిశా సరిహద్దు జగన్నాథపురం వద్ద ప్రైవేటు బస్సుకు తృటిలో ఘోర ప్రమాదం తప్పింది. ఒడిశా బరంపురం నుంచి పాత్రపురం వెళ్తున్న దిగంబర బస్సు సర్వీస్ ఇచ్ఛాపురం మీదగా వెళ్తుండగా జగన్నాథపురం మలుపు వద్ద రోడ్డు వెడల్పు తక్కువగా ఉండడంతో ప్రమాదవశాత్తు అదుపుతప్పి బస్సు ఒకవైపు ఒరిగిపోయింది. దీంతో బస్సులో ఇరవై మంది వరకు ఉన్న ప్రయాణికులు ఒక్కసారిగా అహాకారాలు చేశారు. వెంటనే స్థానికులు బస్సులో ఉన్న వారిని జాగ్రత్తగా కిందకి దించారు. అదృష్టవశాత్తు ఎవరికి ఎటువంటి ప్రమాదం జరగలేదు. ఈ రోడ్డు మలుపు వద్ద తగిన జాగ్రత్తలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.


సీజ్ చేసిన ఇసుక లారీలు

రెండు ఇసుక లారీలు సీజ్

ఆమదాలవలస: మండలంలోని నాగావళి నది నుంచి అక్రమ ఇసుకతో రవాణా చేస్తున్న రెండు ఇసుక లారీలను సీజ్ చేశారు. శుక్రవారం తహాశీల్దార్ రాంబాబు, గనులశాఖ ఆర్ఐ మాణిక్యాలరావు కలిసి నాగావళి నది పరివాహక ప్రాంతంలో ఇసుక రవాణాపై తనిఖీలు నిర్వహించారు. కొత్తవలస ఇసుక ర్యాంపుల నుంచి ప్రతిరోజు విశాఖపట్నం, విజయ నగరం వంటి ప్రాంతాలకు ఇసుకను రవాణా చేసే లారీలు అక్రమంగా తరలిపోతున్నట్లు తమకు అందిన సమాచారం మేరకు తనిఖీలు నిర్వహించగా కొత్తవలస, నారిపేట గ్రామాల మధ్య ఎటువంటి అనుమతులు లేకుండా రెండు ఇసుక లారీలను గుర్తించి పరిశీలించగా నాగావళి నది వద్ద అక్రమంగా ఇసుక తవ్వకాల జరిపి విజయనగరం తరలిస్తున్నట్లు గుర్తించారు. రెండు లారీలను అదుపులోకి తీసుకొని ఆమదాలవలస పోలీస్ స్టేషన్‌కు తరలించి అనంతరం గనుల శాఖకు అప్పగించారు. రెండు ఇసుక లారీలను పోలీసులు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



మాట్లాడుతున్న జగదీష్

ఆయుర్వేదానికి ప్రత్యేక స్థానం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

భారతీయ వైద్య రంగంలో ప్రాచీన కాలం నుంచి ఆయుర్వేదానికి ప్రత్యేక స్థానముందని జిల్లా ఆయుష్ అధికారి డాక్టర్ పి.జగదీష్ అన్నారు. శుక్రవారం నగరంలోని విశాఖ బి కాలనీ షిర్డీసాయి మందిరంలో కొంక్యాన గోవిందరాజులు చారిటబుల్ ట్రస్టు, జిల్లా ఆయుస్ విభాగం సంయుక్తంగా ధన్వంతరీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 29న తొమ్మిదవ జాతీయ ఆయుర్వేద దినంగా ఆయుస్ మంత్రిత్వ శాఖ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. గ్లోబల్ హెల్త్ ఆయుర్వేదం నినాదంతో జాతీయ ఆయుర్వేద దినోత్సవాన్ని దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు కొంక్యాన వేణుగోపాల్, కొంక్యాన గోవింద రాజులు, ట్రస్ట్ చైర్మన్ మురళీధర్, కాంపౌండర్ శేఖర్, రామారావు, వరలక్ష్మి, ఉష, మురళీ, గాయత్రి పాల్గొన్నారు.

పర్యావరణ అంచనాల
కమిటీ సభ్యునిగా గిరిజాశంకర్


గిరిజాశంకర్

పొందూరు: ఎపి పర్యావరణ అంచనాల కమిటీ సభ్యునిగా పొందూరుకు చెందిన ఆంధ్ర విశ్వ విద్యాలయంలో ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్‌గా పని చేస్తున్న ఆచార్య గుంటుకు గిరిజా శంకర్ నియమితులయ్యారు. ఈయనను రాష్ట్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వశాఖ నామినేట్ చేసింది. ఈ పదవిలో మూడేళ్లపాటు కొనసాగనున్నట్లు గజిట్ నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఈయనను ఆంధ్ర యూనివర్శిటీ విసి ఆచార్య జి. శశిభూషణరావు అభినందించారు. ఈయన తండ్రి స్వర్గీయ గుంటుకు మోహనరావు పొందూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్‌గా పనిచేశారు. ఈయన నియామకంపై మాజీ సర్పంచ్ కోరుకొండ జయలక్ష్మి, మాజీ ఎంపిటిసి కోరుకొండ సాయికుమార్, డాక్టర్ డి.వి.ఎస్ ప్రకాశరావు హర్షం వ్యక్తం చేశారు.


చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తి

సిఎం సహాయనిధి చెక్కు అందజేత

ప్రజాశక్తి- పోలాకి

అనారోగ్యానికి గురై బాధపడేవారికి సిఎం రిలీఫ్ ఫండ్ నుంచి ఆర్థికసాయం అందించడం జరుగుతుందని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. శుక్రవారం మబగాం క్యాంపు కార్యాలయంలో తలసముద్రం గ్రామానికి చెందిన కోల యర్రం నాయుడుకు రూ.51, 309 సిఎం రిలీఫ్ ఫండ్ నుంచి వచ్చిన చెక్కును అందజేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సిడిపిఒ విమలారాణి

బాలల రక్షణ కమిటీ ఏర్పాటు

ప్రజాశక్తి- మెళియాపుట్టి

బాలల హక్కుల పరిరక్షణ కోసం మండల కమిటీని ఏర్పాటు చేశామని ఎంపిడిఒ నరసింహ ప్రసాద్ పండా అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బాలల హక్కుల పరిరక్షణ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పాతపట్నం ఐసిడిఎస్ సిడిపిఒ విమలారాణి మాట్లాడుతూ బాలల హక్కులపై గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. దీనికి అధికారులంతా సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎంఇఒ ఎస్.దేవేందర్‌రావు, మెళియాపుట్టి పిహెచ్‌సి వైద్యాధికారి అలేఖ్య, ఎఎస్‌ఐ బి.అప్పన్న, అమరావతి, భారతి పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి- ఆమదాలవలస

మండల పరిషత్ సర్వసభ్య సమావేశం మండల పరిషత్ అధ్యక్షులు తమ్మినేని శారద ఆధ్వర్యంలో శనివారం నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ రోణంకి వెంకటరావు ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఉదయం 10.30 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని, ఈ సమావేశానికి మండలంలోని సర్పంచ్‌లు, ఎంపిటిసిలు హాజరుకావాలని కోరారు. మండల స్థాయి అధికారులు విధిగా సమావేశానికి పూర్తి సమాచారంతో హాజరు కావాలన్నారు.

'కత్తిరి'ని అభినందించిన మంత్రి

కోటబొమ్మాళి: సారవకోట మండల టిడిపి మండల అధ్యక్షులు కత్తిరి వెంకటరమణను రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అభినందించారు. శుక్రవారం నిమ్మాడ కార్యాలయంలో ఆయన మంత్రి అచ్చెన్నాయుడుకు కలిసి చేపట్టిన పార్టీ కార్యక్రమాలను వివరించారు. సోషల్ మీడియా విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచినట్లు వివరించారు. పార్టీ అధికార యాప్‌లో కూడా తాను చేపట్టిన కార్యక్రమాల్లో రాష్ట్రంలో 8 స్థానంలో నిలిచినట్టు మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పార్టీలో సముచిత స్థానం కల్పిస్తామన్నారు.

ఉత్సవాల నిర్వహణకు తీర్మానం

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

పెద్దబొడ్డపాడు పంచాయతీ సీతాపురం గ్రామస్తులంతా ఐకమత్యంగా నందెన్న ఉత్సవాలు జరపుకోడానికి ముందుకు వచ్చారు. గ్రామ కమిటీ సమావేశం సర్పంచ్ తమ్మినాన ఢిల్లీరావు అధ్యక్షతన శుక్రవారం జరిగింది. సంప్రదాయబద్ధంగా ఉత్సవాలు జరపడానికి ఏకగ్రీవంగా తీర్మానించారు. గతంలో జరుపుకొనే విధంగా పగటి వేషాలతో సందడిగా జరుపుకోవాలని తీర్మానించారు. కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి తమ్మినాన అప్పారావు, తమ్మినాన గోపాలరావు, ఉప్పాడ కృష్ణారావు, హనుమంతు గోపాలకృష్ణ, టి.రామయ్య, దుంపల తిరుపతిరావు, తమ్మినాన అప్పలస్వామి, జయరాం, తమ్మినాన నరసింహమూర్తి, హనుమంతు అప్పలస్వామి, తమ్మినాన చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న దీక్షలు

ప్రజాశక్తి- కవిటి

తమ సమస్యల పరిష్కారానికి బెంతు ఒరియాలు చేస్తున్న రిలే నిరాహారదీక్షలు 304వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా శుక్రవారం దీక్షలో కవిటి ఆటో యూనియన్ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బెంతు ఒరియాల యూత్ అధ్యక్షుడు సుమన్ బిసాయి మాట్లాడుతూ అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు. కుల ధ్రువీకరణ పత్రాలు లేకపోవడంతో తమ బిడ్డల భవిష్యత్ అగమ్యగోచరంగా మారుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.

ఐక్యతతో కుట్రలు తిప్పికొడదాం


మాట్లాడుతున్న వాసుదేవరావు

సోంపేట: భారతీయ జీవిత భీమా సంస్థ అక్టోబర్ 1 నుంచి అమలు చేస్తున్న కొత్త వ్యాపార విధానం ఇటు ఏజెంట్లకు అటు గ్రామీణ ప్రజలకు సమస్యాత్మకంగా మారిందని పలువురు వక్తలు ఆవేదన వ్యక్తం చేశారు. అటువంటి సమస్యలు పరిష్కరానికి ఆల్ ఇండియా ఎల్ఐసి ఏజెంట్స్ అసోసియేషన్ పిలుపు ఏజెంట్స్ చేపడుతున్న ఆందోళనపై కొన్ని స్వార్థపర శక్తులు కుట్రలకు పాల్పడుతున్నారని వక్తలు ఆరోపించారు. సోంపేటలో శుక్రవారం పలాస ఏజెంట్స్ అసోసియేషన్ సమావేశం జరిగింది. యూనియన్ నాయకులు రాజేంద్ర నాయుడు, కోదండరావు, ప్రకాష్, ఢిల్లేశ్వరరావు, శ్రీనివాసరావు, చిన్నారావు తదితరులు మాట్లాడుతూ ఐక్యతగా దేశవ్యాప్తంగా ఏజెంట్లు చేస్తున్న పోరాటంతో యాజమాన్యం ఆలోచనలో పడిందన్నారు. ఏజెంట్ల ఐక్యత దెబ్బతీసేలా కొందరు ఉద్యోగులు చేస్తున్న నిర్వాకం సహించేది లేదన్నారు. ఇటువంటి కుట్రపూరిత చర్యలను ఏజెంట్లు ఐక్యతగా తిప్పికొట్టాలన్నారు. పాలసీదారుల బోనస్ పెంచాలని, ఏజెంట్స్ కమిషన్ పెంచాలని, రూ.లక్ష కనీస పాలసీలను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీనియర్ ఏజెంట్లు వసంతరావు, రామ్మూర్తి, వాసుదేవరావు, పద్మాలోచన తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ దృష్టికి సమస్యలు

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండలంలోని పలు పాఠశాలల్లో ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రఘువర్మ పర్యటించారు. శుక్రవారం మండలంలోని చాపర, నేలబొంతు, బందపల్లి, కోసమాల, నడసంద్ర ఉన్నత పాఠశాలలు, గిరిజన ఆశ్రమ పాఠశాలలు, సాంఘిక సంక్షేమ పాఠశాలలను సందర్శించి ఉపాధ్యాయుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆశ్రమ పాఠశాలలో రెగ్యులర్ ప్రాతిపదికన వార్డెన్, ఎఎన్ఎం పోస్టుల భర్తీ, కొంతమంది సిఆర్‌టిలను అనివార్య కారణాలతో రెగ్యులర్ చేయకపోవడం, జీతాల సమస్యలు, ఉపాధ్యాయుల పెండింగ్ బకాయిలపై


ఉపాధ్యాయులతో ఎమ్మెల్సీ రఘువర్మ

సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానన్నారు. కార్యక్రమంలో ఎపిటిఎఫ్ జిల్లా, మండల నాయకులు కృష్ణమూర్తి, బి.ఢిల్లేశ్వరరావు, జన్ని ధర్మారావు, అనిల్, పూర్ణ చంద్రరావు, రామారావు, రవికాంత్, ఢిల్లేశ్వరరావు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.


వాహనదారులకు హెల్మెట్ ప్రాముఖ్యతను వివరిస్తున్న ఎస్ఐ

హెల్మెట్ ధారణ తప్పనిసరి

ప్రజాశక్తి- సంతబొమ్మాళి

వాహనం నడిపే ప్రతి వాహనదారుడు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని ఎస్ఐ వై.సింహాచలం అన్నారు. శుక్రవారం బోరుభద్ర, సంతబొమ్మాళి జంక్షన్‌లో వాహనాలను తనిఖీ చేసి హెల్మెట్ ధరించని వారికి అపరాధ రుసుం విధించారు. ఈ సందర్భంగా ఆయన హెల్మెట్ ప్రాముఖ్యతను వివరించారు. ప్రమాదాలు జరిగేటప్పుడు తలకు హెల్మెట్ ఉండడం వలన ప్రాణాపాయ స్థితి నుంచి గట్టెక్కవచ్చని వాహనదారులకు సూచనలు చేశారు.

రహదారి సౌకర్యం కల్పించాలి

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

జిల్లాలో దారిలేని ఊరుగా పేరుపడిన పూడిలంకకు రహదారి సౌకర్యం కల్పిస్తే జనసేన అధినేత, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్‌కు గుడి కడతామని పూడిలంక గ్రామ యువత తెలిపారు. శుక్రవారం జనసేన నియోజకవర్గ సమన్వయకర్త వి.దుర్గారావు, వజ్రపుకొత్తూరు క్లస్టర్ ఇన్‌ఛార్జి దువ్వాడ వంశీకృష్ణ చౌదరిలను కలిసి వినతిపత్రం అందించారు. వర్షాకాలంలో ఉప్పుటేరులోకి వరదనీరు పోటెత్తితే బయట ప్రపంచంతో సంబంధాలు తెగిపోతాయని వారు పేర్కొన్నారు. గ్రామీణాభివృద్ధి


దుర్గారావుకు వినతిపత్రం అందజేస్తున్న యువకులు

మంత్రిగా ఉన్న పవన్ కళ్యాణ్ చొరవ తీసికొని రహదారి సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ సమస్యను డెప్యూటీ సిఎం దృష్టికి తీసుకువెళ్తానని దుర్గారావు భరోసా ఇచ్చారు.

రసాయన రహిత ఆహారం అందించాలి


ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్న సింహాచలం

ప్రజాశక్తి- సంత బొమ్మాళి

అంగన్వాడీలో చదువుతున్న పిల్లలకు రసాయన రహిత ఆహారాన్ని అందించాలని ప్రకృతి వ్యవసాయం మోడల్ మేకర్ పి.సింహాచలం అన్నారు. శుక్రవారం బోరుభద్రలో అంగన్వాడీ సిబ్బందికి ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులపై అవగాహన కల్పించారు. ప్రతి అంగన్వాడీ కేంద్రాల వద్ద ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో ఆకుకూరలు, కాయగూరలు, పండ్ల మొక్కలు వేయాలన్నారు. పిల్లలకు 365 రోజులు రసాయన రహిత గో-ఆదారిత ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో పండించిన ఆహారాన్ని అందించాలన్నారు. కార్యక్రమంలో మోడల్ మేకర్ కె.ఉష, యూనిట్ ఇన్‌ఛార్జి, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

బ్రహ్మాస్త్రం తయారీపై అవగాహన

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

మొక్కజొన్న, వరిలో కాయ, కాండం తొలిచే పురుగు నివారణకు, లార్వా పురుగుల నివారణకు ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ కంబపు కృష్ణ సమక్షంలో బ్రహ్మాస్త్రం, అగ్ని అస్త్రం రైతులకు అవగాహన కల్పిస్తూ రణస్థలం మహిళా రైతుల సమక్షంలో తయారు చేశారు. అలాగే బంటుపల్లిలో యూనిట్ ఇన్‌ఛార్జి పెద్దింటి రాజేశ్వరి సమక్షంలో బ్రహ్మాస్త్రం తయారు చేశారు. యూనిట్ ఇన్‌ఛార్జి కొయ్యాన రాంబాబు, ప్రకృతి వ్యవసాయ గ్రామ కార్యకర్తలు కె.లక్ష్మి, జి.రమణమ్మ, ఎ.ప్రమీల, బి.సంతోషి, పి.సురేష్‌కుమార్, జి. సూర్య కాంతం, కె.రామలక్ష్మి, రైతులు ఈశ్వరరావు, అప్పారావు పాల్గొన్నారు.


కషాయం తయారు చేస్తున్న మహిళలు

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

పట్టణ పోలీసుల ఆధ్వర్యంలో కస్తూరిబా గాంధీ విద్యాలయంలో విద్యార్థులకు పట్టణ ఎస్ఐ చిన్నం నాయుడు విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అనంతరం సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో టౌన్ హెడ్ కానిస్టేబుల్ రామారావు, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

పొందూరు: మండలంలోని లోలుగు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో పోలీస్ అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా ఎస్ఐ వి.సత్యనారాయణ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించారు. పోలీస్‌స్టేషన్‌లో ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు పోలీసుల


ఇచ్ఛాపురం : వ్యాసరచన పోటీలను పర్యవేక్షిస్తున్న ఎస్ఐ

విధులు, స్టేషన్ నిర్వాహణ వంటి పలు అంశాలపై ఎఎస్ఐ సువ్వారి రామచంద్రరావు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కపాసుకుద్దిలో వైద్య శిబిరం

ప్రజాశక్తి- కవిటి

మండలం రాజపురం పిహెచ్‌సి వైద్యులు శశిధర్ నేతృత్వంలో శుక్రవారం కాపాసుకుద్దిలో వైద్య శిబిరం నిర్వహించారు. జ్వరంతో బాధపడుతున్న పలువురు రోగులను పరిశీలించి మందులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామంలో ప్రస్తుతం వైరల్ జ్వరాలున్నాయని, అవికూడా పూర్తిస్థాయిలో కాకుండా కొద్ది మందికి మాత్రమే ఉన్నట్టు తెలిపారు. అలాగే వ్యక్తిగత పరిశుభ్రత లేనిదే జ్వరాలు అదుపులోకి రావని, ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు.


రోగులను పరీక్షిస్తున్న వైద్యులు శశిధర్


గ్రామంలో పేరుకుపోయిన మురుగునీరు

పారిశుధ్య నిర్వహణపై అసంతృప్తి

ఈ సందర్భంగా గ్రామంలో తరచుగా రోగాలు ప్రబలడానికి పారిశుధ్య నిర్వహణ సరిగా లేకపోవడమే కారణమని డాక్టర్ శశిధర్ అన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా లేకపోవడంతో అనేక రోగాలు వ్యాపిస్తున్నట్టు తెలిపారు. పారిశుధ్య నిర్వహణపై గతంలో స్థానిక పంచాయతీ అధికారి, నాయకులకు చెప్పినా ఫలితం లేదని ఆయన వాపోయారు. అయినప్పటికీ శుక్రవారం మరోసారి గ్రామ పెద్దలతో మాట్లాడి పారిశుధ్య నిర్వహణ సక్రమంగా నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ పెద్ద బడే రామారావు, జల్లు రవి తదితరులు పాల్గొన్నారు.

యోగా శిక్షణా తరగతులు ప్రారంభం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

రెడ్‌క్రాస్ పరిపాలన విభాగంలో ఉచిత యోగ శిక్షణా తరగతులను కార్యదర్శి బలివాడ మల్లేశ్వరరావు శుక్రవారం ప్రారంభించారు. ప్రజల ఆరోగ్య సంరక్షణలో భాగంగా ఈ శిక్షణలు నిర్వహిస్తున్నట్టు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ ఛైర్మన్ పి.జగన్మోహనరావు మాట్లాడుతూ యోగా మాస్టార్ రామారావు పర్యవేక్షణలో యోగ శిక్షకులు ఎం.గాయత్రి తరగతులను నిర్వహిస్తారని, మహిళలకు, పురుషలకు ప్రత్యేకంగా యోగా తరగతులు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఉచిత యోగ తరగతులకు హాజరయ్యేందుకు ఆసక్తి ఉన్నవారు ఎం.గాయత్రి, ఫోన్ 9493043999 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.


మాట్లాడుతున్న జగన్మోహనరావు

కార్యక్రమంలో రామరావు, రెడ్‌క్రాస్ కోశాధికారి కనుగుల దుర్గా శ్రీనివాస్, వైకుంఠరావు, బి.సతీష్, బెజ్జిపురం యూత్ క్లబ్ ప్రసాదరావు, స్వీప్ రమణమూర్తి, కళ్యాణ్, నరసింగరావు, పెంకి చైతన్య, గొలివి రమణ పాల్గొన్నారు.

చీడపీడల నివారణపై అవగాహన


రైతులకు అవగాహన కల్పిస్తున్న ఎఒ నరసింహమూర్తి

ప్రజాశక్తి- సోంపేట

వరి పంటను ఆశించే చీడ, పీడల నివారణపై రైతులకు మండల వ్యవసాయాధికారి నరసింహమూర్తి అవగాహన కల్పించారు. మండలంలోని పొత్రకండలో శుక్రవారం పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అంతకు మిత్ర పురుగులు, చిత్రపురుగుల కోసం తెలియజేశారు. పంటకు మద్దతు ధర కాకుండా గిట్టుబాటు ధర లభించేలా వ్యవసాయానికి సహకరిస్తామన్నారు.

రైతులు వ్యవసాయ అధికారుల సూచనలతో సేంద్రియ పద్ధతులు పాటించి, సేంద్రియ వ్యవసాయం వైపు దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది వర్ష కుమారి, రైతులు పాల్గొన్నారు.

గోశాలకు ఆవుల తరలింపు

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

మేజర్ పంచాయతీ టెక్కలిలో రోడ్డుపై తిరుగుతున్న ఆవులను కార్యదర్శి కె.వి.వి. జగన్నాథరావు శుక్రవారం గోశాలకు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు తమ ఆవులను ఇంటివద్ద కట్టుకోవాలని, రోడ్డుపై కనిపిస్తే గోశాలకు తరలించడం జరుగుతుందన్నారు. గోశాలకు తరలించిన ఆవులను తమ ఆధార్ కార్డు పట్టుకొని వచ్చి అపరాధ రుసుం రే.వెయ్యి చెల్లించాలన్నారు. పశువుల పెంపకందారులు గమనించి సహకరించాలని కోరారు.


గోశాలకు తరలించిన ఆవు